05-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రితో సర్వ సంబంధాలను పెట్టుకున్నట్లయితే బంధనాలు సమాప్తమవుతాయి, మాయ బంధనాలలో బంధిస్తుంది మరియు తండ్రి బంధనాల నుండి ముక్తులుగా చేస్తారు"

ప్రశ్న:- నిర్బంధనులు అని ఎవరిని అంటారు? నిర్బంధనులుగా అవ్వడానికి ఉపాయమేమిటి?

జవాబు:- నిర్బంధనులు అనగా అశరీరి. దేహ సహితంగా దేహానికి సంబంధించిన ఏ సంబంధాలూ బుద్ధిని తమవైపుకు ఆకర్షించకూడదు. దేహాభిమానంలోనే బంధనము ఉంది. దేహీ-అభిమానులుగా అయినట్లయితే అన్ని బంధనాలు సమాప్తమవుతాయి. జీవిస్తూ మరణించడమే నిర్బంధనులుగా అవ్వడము. ఇప్పుడిది అంతిమ సమయమని, నాటకం పూర్తయ్యిందని, మనం తండ్రి వద్దకు వెళ్ళామని బుద్ధిలో ఉండాలి, అప్పుడు నిర్బంధనులుగా అవుతారు.

పాట:- ఎవరికైతే భగవంతుడు తోడుగా ఉన్నారో... (జిస్కా సాథీ హై భగవాన్...)

ఓం శాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు. ఇప్పుడు ఇంతమంది పిల్లలు ఉన్నారంటే తప్పకుండా అనంతమైన తండ్రి ఉంటారు. వారిని నిరాకార శివబాబా అని కూడా అంటారని తండ్రి అర్థం చేయిస్తున్నారు. బ్రహ్మను కూడా బాబా అని అంటారు, విష్ణువును లేక శంకరుడిని బాబా అని అనరు. శివుడిని ఎల్లప్పుడూ బాబా అనే అంటారు. శివుని చిత్రము వేరు, శంకరుని చిత్రము వేరు. శివాయ నమః అన్న పాట కూడా ఉంది. మళ్ళీ నీవే తల్లివి, తండ్రివి... అని అంటారు. తప్పకుండా నిరాకారుడైన శివుడినే తండ్రి అంటారని అర్థం చేయించడం చాలా సహజము. వారు ఆత్మలందరికీ తండ్రి. శంకరుడు లేక విష్ణువు నిరాకారమైనవారు కాదు. శివుడిని నిరాకారుడు అని అంటారు. మందిరాలలో వారందరి చిత్రాలు ఉన్నాయి. భక్తి మార్గంలో ఎన్ని చిత్రాలు ఉన్నాయి. ఉన్నతోన్నతమైన చిత్రముగా శివబాబాది చూపిస్తారు, ఆ తర్వాత బ్రహ్మ, విష్ణువు, శంకరుల చిత్రాలను చూపిస్తారు. వారికి కూడా రూపము ఉంది. జగదాంబ, జగత్పితలకు కూడా రూపము ఉంది. లక్ష్మీ-నారాయణులకు కూడా సాకార రూపము ఉంది. ఇకపోతే ఒక్క భగవంతుడే నిరాకారుడు. కానీ వారిని కేవలం 'భగవంతుడు' అని అనడం వలన మనుష్యులు తికమకపడతారు. భగవంతుడు మీకు ఏమవుతారు అని అడగండి, అప్పుడు వారు తండ్రి అని చెప్తారు. కావున భగవంతుడు తండ్రి అని నిరూపించి చెప్పాలి. తండ్రి రచయిత అయినట్లయితే మరి తల్లి కూడా కావాలి. తల్లి లేకుండా తండ్రి సృష్టిని ఎలా రచిస్తారు. ఆ తండ్రి ఎప్పుడు వస్తారు? ఓ పతితులను పావనంగా తయారుచేసేవారా రండి అని అందరూ పిలుస్తారు. ఇప్పుడైతే మొత్తం ప్రపంచమంతా పతితముగా ఉంది. పతితులుగా ఉన్నారు కావుననే కదా వచ్చి పావనంగా తయారుచేస్తారు. దీని ద్వారా - తండ్రి తప్పకుండా పతిత ప్రపంచంలోకి రావలసి ఉంటుందని నిరూపించబడుతుంది. కానీ డ్రామానుసారంగా ఇది ఎవరికీ అర్థం కాదు. అర్థం కాదు, అందుకే తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు. భారత్ లోనే జ్ఞానం మరియు భక్తి అని గాయనం చేయబడుతుంది, అలాగే బ్రహ్మ యొక్క పగలు మరియు బ్రహ్మ యొక్క రాత్రి అని అంటారు. రాత్రివేళలో ఘోర అంధకారము ఉంటుంది. జ్ఞాన అంజనాన్ని సద్గురువు ఇవ్వడంతో అజ్ఞాన అంధకారము వినాశనమయ్యింది అని అంటూ ఉంటారు కూడా. మనుష్యుల్లో ఎంతటి అజ్ఞానం ఉందంటే, వారికి తండ్రి గురించి కూడా తెలియదు. ఇటువంటి అజ్ఞానం ఇంకేదీ ఉండదు. పరమపిత, ఓ గాడ్ ఫాదర్ అని సంబోధిస్తూ ఒకవేళ వారి గురించి తెలియకపోతే, దానంతటి అజ్ఞానం ఇంకేదీ ఉండదు. పిల్లలు ఒకవైపు బాబా అని సంబోధిస్తూ ఇంకొకవైపు మాకు వారి వృత్తి గురించి, నామ-రూపాల గురించి తెలియదు అని అంటే వారిని అమాయకులు అనే అంటారు కదా. ఇదే భారతవాసుల పొరపాటు, తండ్రి అని అంటూ ఉన్నా వారి గురించి తెలియదు. ఓ గాడ్ ఫాదర్, వచ్చి పతితులను పావనంగా చేయండి, దుఃఖము నుండి విడిపించండి, దుఃఖాన్ని హరించి సుఖాన్ని ఇవ్వండి అని పాడుతారు. తండ్రి ఒక్కసారి మాత్రమే వస్తారు. ఇది మీకు నంబరువారుగా తెలుసు. కొందరైతే - మేము తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి అని అనుకోరు.

తండ్రి గురించి పూర్తి పరిచయము లేదు కావున - ఏం చేయాలి, బంధనము ఉంది అని అంటారు. జీవిస్తూ మరణించడం వచ్చినట్లయితే మీ బంధనాలు సమాప్తమైపోతాయి. మనుష్యులు అకస్మాత్తుగా మరణిస్తే బంధనాలు తొలగిపోతాయి. ఇప్పుడైతే అందరి బంధనాలు తొలగిపోనున్నాయి. మీరు జీవిస్తూ నిర్బంధనులుగా అనగా అశరీరులుగా అవ్వాలి. తండ్రి అంటారు - ఈ శారీరక బంధనాలు మొదలైనవాటిని మర్చిపోండి. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రినైన నన్ను

స్మృతి చేయండి. ఇకపోతే ఎప్పుడైతే మీరు దేహాభిమానులుగా అవుతారో, అప్పుడు బంధనముగా అనిపిస్తుంది, అందుకే - ఎలా విముక్తులుగా అవ్వాలి అని అడుగుతారు. తండ్రి అంటారు, గృహస్థ వ్యవహారంలో ఉండండి కానీ - మేము తిరిగి వెళ్ళాలి అన్నది బుద్ధిలో ఉండాలి. ఏ విధంగా నాటకం సమాప్తమయ్యే సమయంలో పాత్రధారులు నాటకం నుండి అతీతముగా అవుతారు. పాత్రను అభినయిస్తూ, అభినయిస్తూ బుద్ధిలో ఉంటుంది - ఇంకా కొద్ది సమయమే ఉంది, ఈ పాత్రను అభినయించి ఇక ఇంటికి వెళ్తాము అని. మీరు కూడా - ఇప్పుడిది అంతిమము, మేము దైవీ సంబంధంలోకి వెళ్తాము అని బుద్ధిలో ఉంచుకోవాలి. ఈ పాత ప్రపంచములో ఉంటూ, మేము తండ్రి వద్దకు వెళ్తాము అన్నది బుద్ధిలో ఉండాలి. మేము మీపై బలిహారమవుతాము అని ఈ విధంగా పాడుతారు కూడా. జీవిస్తూ మీకు చెందినవారిగా అవుతాము. ఇకపోతే దేహ సహితంగా దేహ సంబంధాలేవైతే ఉన్నాయో వాటిని మరచి మేము మీతోనే సంబంధాన్ని పెట్టుకుంటాము. సంబంధము ఉన్నట్లయితే స్మృతి చేయండి, ప్రేమించండి. తండ్రితో మరియు మీ ప్రియతమునితో బుద్ధియోగాన్ని జోడించండి. తద్వారా మీపై ఏ తుప్పు అయితే పట్టి ఉందో అది తొలగిపోతుంది. యోగము గురించి మహిమ ఉంది కదా. మిగిలినవన్నీ దైహికమైన యోగాలు - మామయ్య, చిన్నాన్న, పెదనాన్న, గురువులు, పండితులు మొదలైన వారందరితో యోగాన్ని జోడిస్తారు. తండ్రి అంటారు - వీరందరి నుండి యోగాన్ని తొలగించి నన్నొక్కరినే స్మృతి చేయండి. యోగము నా ఒక్కరితోనే జోడించండి. దేహాభిమానంలోకి రాకండి. దేహముతో కర్మలు చేస్తూ కూడా - మేము పాత్రను అభినయిస్తున్నాము అన్న ఈ నిశ్చయాన్ని ఏర్పర్చుకోండి. ఇప్పుడిది ఈ పాత ప్రపంచం యొక్క అంతిమము, ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి, దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాల నుండి అతీతంగా అవ్వాలి. ఈ విధంగా మీతో మీరు మాట్లాడుకోవాలి. ఇప్పుడైతే తండ్రి వద్దకు వెళ్ళాలి. కొందరికి స్త్రీ యొక్క బంధనము ఉంది, కొందరికి పతి యొక్క బంధనము ఉంది, కొందరికి ఇంకెవరిదో బంధనము ఉంది. బాబా అయితే ఎన్నో యుక్తులను తెలియజేస్తారు. మీరు చెప్పండి - మేము పవిత్రంగా అయి భారత్ ను తప్పకుండా పవిత్రంగా తయారుచేయాలి అని. మనం పవిత్రంగా అయి తనువు, మనస్సు, ధనం ద్వారా సేవ చేస్తాము. కానీ మొదట నష్టోమోహులుగా ఉండాలి. మోహం దూరమైతే గవర్నమెంటుకు ఉత్తరం వ్రాయండి, అప్పుడు వారు కూడా మీకు సహయోగము ఇస్తారు. వారికి ఈ విధంగా చెప్పండి - కామము మహాశత్రువు అని భగవానువాచ ఉంది, మేము దానిపై విజయాన్ని పొంది పవిత్రముగా ఉండాలనుకుంటున్నాము. పవిత్రముగా అయినట్లయితే స్వర్గానికి యజమానులుగా అవుతారు అని తండ్రి ఆజ్ఞ ఉంది. మాకు వినాశనము మరియు స్థాపన యొక్క సాక్షాత్కారము జరిగింది, ఇప్పుడు పవిత్రంగా అవ్వడంలో వీరు నాకు విఘ్నాలను కలిగిస్తున్నారు, కొడుతున్నారు. నేనైతే భారత్ యొక్క సత్యమైన సేవలో ఉన్నాను, ఇప్పుడు నాకు ఆశ్రయము ఇవ్వండి. కానీ ఈ విధంగా చెప్పడానికి పక్కా నష్టోమోహులుగా ఉండాలి. సన్యాసులైతే ఇళ్ళు-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. ఇక్కడైతే తోడుగా ఉంటూ నష్టోమోహులుగా అవ్వాలి. సన్యాసుల మార్గం వేరు. గృహస్థ వ్యవహారములో ఉంటూ జనక మహారాజు వలె ముక్తి, జీవన్ముక్తులను పొందగలిగే జ్ఞానాన్ని మాకు ఇవ్వండి అని మనుష్యులు అంటారు కూడా. అదే ఇప్పుడు మీకు లభిస్తోంది కదా.

బాబా అంటారు, ఇతను నా పత్ని (యుగళ్), ఇతని నోటి ద్వారా నేను ప్రజలను రచిస్తాను. ప్రజాపిత బ్రహ్మా యొక్క ముఖము ద్వారానే ఇలా అంటారు. శివబాబా మీతో - మీరు నా మనుమలు అని అంటారు. వీరేమో - మీరు నా పిల్లలుగా అయి శివబాబా మనుమలుగా అవుతారు అని అంటారు. వారసత్వం వారి నుండే లభిస్తుంది. స్వర్గ వారసత్వాన్ని మనుష్యులెవ్వరూ ఇవ్వలేరు. దానిని నిరాకారుడే ఇస్తారు. కావున భక్తి వేరు, జ్ఞానం వేరు. భక్తిలో వేద-శాస్త్రాలను చదువుతారు, యజ్ఞ-తపాదులు, దాన-పుణ్యాలు చేస్తూ ఎంతో ఖర్చు అవుతుంది, ఇదంతా భక్తి సామాగ్రియే. భక్తి ద్వాపరము నుండి ప్రారంభమవుతుంది. దేవీ-దేవతలు ఎప్పుడైతే వామ మార్గంలోకి వచ్చి పతితులుగా అవుతారో, అప్పుడిక దేవీ-దేవతలు అన్న పేరుతో పిలువబడలేరు ఎందుకంటే దేవతలైతే సంపూర్ణ నిర్వికారులుగా ఉండేవారు. వామ మార్గంలోకి వెళ్ళడం వలన వికారులుగా అవుతారు. అందుకే దేవతా ధర్మం వారు వామ మార్గంలోకి వచ్చి పతితులుగా అయ్యారు అని అంటారు. పతితులను దేవతలు అని అనలేరు. అందుకే మళ్ళీ హిందువులు అన్న పేరును పెట్టారు. వేద-శాస్త్రాలలో ఆర్యులు అన్న పేరును వ్రాసారు. ఆర్యులు అన్న పేరు ఈ భారతఖండానికే వర్తిస్తుంది. అసలు ఈ పదము ఎక్కడి నుండి వచ్చింది? సత్యయుగంలోనైతే ఆర్యులు అన్న పదమే లేదు. క్రైస్తుకు 3,000 సంవత్సరాల క్రితం భారత్ లో దేవీ-దేవతలు చాలా వివేకవంతులుగా ఉండేవారు అని అంటారు కూడా, మళ్ళీ ఆ దేవతలే ద్వాపరములో వికారులుగా అయినప్పుడు అనార్యులు అని పిలువబడతారు. ఎవరో ఒకరు ఆర్యులు అని అనడంతో ఇక ఆ పేరు కొనసాగుతూ ఉంటుంది. ఏ విధంగా ఎవరో ఒకరు కృష్ణ భగవానువాచ అని అనడంతో లేక వ్రాయడంతో, ఇక దానినే విశ్వసించడం మొదలుపెడతారు. శివాయ నమః, నీవే తల్లివి, తండ్రివి అని పాడుతారు కానీ వారు ఏ విధంగా తల్లి-తండ్రి అవుతారు, రచనను ఎప్పుడు రచిస్తారు, అది తెలియదు. తప్పకుండా

సృష్టి ఆదిలోనే రచించి ఉంటారు. ఇంతకీ సృష్టి ఆది అని దేనిని అనవచ్చు? సత్యయుగమునా లేక సంగమయుగమునా? సత్యయుగములోనైతే తండ్రి రారు. సత్యయుగ ఆదిలో వచ్చేది లక్ష్మీ-నారాయణులు. వారిని సత్యయుగ యజమానులుగా ఎవరు తయారుచేసారు? వారు కలియుగంలోకి కూడా రారు. ఇది కల్పము యొక్క సంగమయుగము. తండ్రి అంటారు, నేను ప్రతి కల్పము సంగమయుగంలో వస్తాను, ఆ సమయానికి ఆత్మలందరూ పతితులుగా అవుతారు మరియు సృష్టి పాతబడుతుంది. డ్రామా చక్రము ఎప్పుడైతే పూర్తవుతుందో అప్పుడే తండ్రి వస్తారు కదా. పిల్లలైన మీలో చాలా తెలివి ఉండాలి, ధారణ ఉండాలి. వేదాలను చదవడం ద్వారా లాభమేమిటి, అసలు వేదాలను ఎందుకు చదవాలి అని కాన్ఫరెన్సులు చేస్తారు, కానీ ఏమీ నిర్ణయించలేకపోతారు. మళ్ళీ అదే కాన్ఫరెన్సును వచ్చే సంవత్సరం చేస్తారు, నిర్ణయించుదామని కూర్చుంటారు కానీ ఏమీ జరగదు. వినాశనము యొక్క ఏర్పాట్లు కూడా జరుగుతూ ఉంటాయి. బాంబులను తయారుచేస్తూ ఉంటారు. ఇప్పుడు ఇది కలియుగము. ఈ విషయాలు పిల్లలైన మీకే తెలుసు. మీ విషయాలు పూర్తిగా అతీతమైనవి. మనుష్యులు మనుష్యులకు గతి, సద్గతులను ఇవ్వలేరని మీకు తెలుసు. పతిత-పావనా అని పాడుతారు కూడా, మరి స్వయాన్ని పతితులుగా ఎందుకు భావించరు? ఇది పతిత ప్రపంచము, విషయసాగరము. అందరూ నావికులుగా అవ్వగలరా.

పూర్తిగా అర్థం చేయించగలిగే శక్తి ఇప్పుడు ఇంకా పిల్లలైన మీలో రాలేదు. ఇప్పుడు మీరు ఇంకా అంత తెలివైనవారిగా అవ్వలేదు. యోగము కూడా లేదు. ఇప్పటివరకూ ఇంకా చిన్న పిల్లల్లా ఏడుస్తూ ఉంటారు. మాయ తుఫానులో నిలువలేకపోతారు. దేహాభిమానము ఎంతో ఉంది. దేహీ-అభిమానులుగా అవ్వరు. స్వయాన్ని ఆత్మగా భావించండి అని బాబా అయితే పదే-పదే చెప్తారు. ఇప్పుడు మనం తిరిగి వెళ్ళాలి. పాత్రధారులందరూ ఎవరైతే తమ-తమ పాత్రను అభినయిస్తున్నారో, వారందరూ శరీరాలను వదిలి తిరిగి ఇంటికి వెళ్తారు. మీరు సాక్షిగా అయి చూడండి. దేహధారీ సంబంధాలలో, దేహములో మోహాన్ని ఎందుకు ఉంచుతున్నారు? విదేహీగా అవ్వరు. కావున వికర్మలు వినాశనమవ్వవు. తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నట్లయితే సంతోషపు పాదరసము పైకెక్కుతుంది. మనల్ని శివబాబా చదివిస్తారు, తర్వాత మనం దేవీ-దేవతలుగా అవుతాము, కావున అపారమైన సంతోషము ఉండాలి కదా.

భారతవాసులు ఎప్పుడైతే సుఖములో ఉండేవారో అప్పుడు మిగిలిన మనుష్యులందరూ నిర్వాణధామంలో, శాంతిధామంలో ఉండేవారు అని మీకు తెలుసు. ఇప్పుడు ఎన్ని కోట్లమంది మనుష్యులున్నారు. ఇప్పుడు మీరు జీవన్ముక్తిని పొందేందుకు పురుషార్థం చేస్తున్నారు. మిగిలినవారంతా తిరిగి వెళ్ళిపోతారు. పాత ప్రపంచం మారి కొత్త ప్రపంచంగా అవ్వనున్నది. కొత్తదానిని తండ్రే తయారుచేస్తారు. అంటు కట్టబడుతోంది. ఇది దైవీ పుష్పాల అంటు. మీరు ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతారు. పుష్పాల తోట పూర్తిగా తయారైపోతే ఈ ముళ్ళ అడవి అంతమైపోతుంది. దీనికి నిప్పు అంటుకోనున్నది. తర్వాత మనము పుష్పాల తోటలోకి వెళ్ళిపోతాము. మనం మమ్మా, బాబాలను ఎందుకు ఫాలో చేయకూడదు. మాత-పితలను ఫాలో చేయండి అని అంటూ ఉంటారు. ఈ మమ్మా, బాబా లక్ష్మీ-నారాయణులుగా అవుతారని మీకు తెలుసు. వీరే 84 జన్మలను గడిపారు. మీరు కూడా అంతే. వీరిది ముఖ్యమైన పాత్ర. తండ్రి వచ్చి సూర్యవంశీ, చంద్రవంశీ స్వరాజ్యాన్ని మళ్ళీ స్థాపన చేస్తున్నారని వ్రాయబడుతుంది కూడా. ఎంతగా అర్థం చేయించడం జరుగుతుంది, అయినా దేహాభిమానం తెగదు. నా పతి, నా పిల్లలు... అరే, ఇవి పాత ప్రపంచంలోని పాత సంబంధాలు కదా. నాకైతే ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. దేహధారులందరి నుండి మమకారము తొలగిపోవడం ఎంతో కష్టమవుతుంది. వీరికి మమకారము తొలగడం కష్టమనిపిస్తోంది, వీరి ముఖము చూస్తే అలా కనిపిస్తుంది అని తండ్రి భావిస్తారు. కుమారీలు మంచి సహాయకులుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. దేహ సహితంగా అందరి నుండి మోహాన్ని తొలగించి విదేహీగా అయ్యేందుకు పూర్తి పురుషార్థం చేయాలి. ప్రతి పాత్రధారి పాత్రను సాక్షిగా అయి చూడాలి. బంధనముక్తులుగా అవ్వాలి.

2. ఈ పాత ప్రపంచం నుండి అతీతముగా అవ్వాలి. మేమైతే ఇప్పుడు తిరిగి వెళ్ళాలి, ఇప్పుడు ఇది పాత ప్రపంచపు అంతిమ సమయము, మా పాత్ర పూర్తయ్యింది అని తమతో తాము మాట్లాడుకోవాలి.

వరదానము:- సర్వ ఖజానాల సంపన్నత ద్వారా సంపూర్ణతను అనుభవము చేసే ప్రాప్తి స్వరూప భవ

ఏ విధంగా చంద్రుడు సంపన్నంగా ఉన్నప్పుడు ఆ సంపన్నత అనేది దాని సంపూర్ణతకు గుర్తుగా ఉంటుంది, ఇక అంతకన్నా పెరగదు, అదే సంపూర్ణత, కొద్దిగా కూడా అంచు తక్కువ ఉండదు, అదే విధంగా పిల్లలైన మీరు ఎప్పుడైతే జ్ఞానం, యోగము, ధారణ మరియు సేవతో అనగా అన్ని ఖజానాలతో సంపన్నంగా ఉంటారో, అప్పుడు ఆ సంపన్నతనే సంపూర్ణత అని అంటారు. ఇటువంటి సంపన్న ఆత్మలు ప్రాప్తి స్వరూపులుగా ఉన్న కారణంగా స్థితిలో కూడా సదా సమీపంగా ఉంటారు.

స్లోగన్:- దివ్య బుద్ధి ద్వారా సర్వ సిద్ధులను ప్రాప్తి చేసుకోవటమే సిద్ధి స్వరూపులుగా అవ్వటము.